క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

పోరుమామిళ్ల : ఏపీటీఎఫ్ పోరుమామిళ్ల రీజియన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. టేకూరుపేట, ఇత్రంపేట, కలసపాడు, గోవిందాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు, పుల్లివీడు యూపీ పాఠశాల 7వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రీజియన్ నాయకులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీ కొని ఒకరికి గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక దువ్వూరు రోడ్డులోని చెన్నమరాజుపల్లె సర్కిల్‌లో మంగళవారం ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీ కొని అమృతానగర్‌కు చెందిన అబ్దుల్ మునాఫ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. అబ్దుల్‌మునాఫ్ అమృతానగర్ నుంచి ప్రొద్దుటూరు పట్టణం వైపు బైక్‌లో బయలుదేరాడు. అతను రింగ్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అబ్దుల్ మునాఫ్‌ను కర్నూలుకు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు.

రేషన్ దుకాణంలో తనిఖీలు

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలోని ఓ రేషన్ దుకాణంలో ప్రొద్దుటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జున సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు జరిపారు. బియ్యం నిల్వలు, పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు బియ్యం పంపిణీ జరగాలని ఆయన హెచ్చరించారు.

రాజకీయాలతో సంబంధం లేదు

ప్రొద్దుటూరు క్రైం : రాజకీయాలతో సంబంధం లేకుండా జార్జిక్లబ్‌ను నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి తెలిపారు. స్థానిక జార్జికారోనేషన్ క్లబ్‌లో మంగళవారం కమిటి సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్లబ్ తరపున అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా తర్వాత క్లబ్‌లో అన్ని రకాల కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. మళ్లీ క్లబ్‌లో కార్యక్రమాలను కొనసాగించడానికి ఎస్పీ అనుమతి కోసం క్లబ్ సభ్యులందరం కడపకు వెళ్లినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చాపాడు : సంక్రాంతి ఉత్సవాలను నిబంధనల మేరకే జరుపుకోవాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం సన్నిధిలో మంగళవారం సాయంత్రం ఉత్సవాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఉత్సవాల నేపథ్యంలో అసాంఘిక కార్యక్రలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

వెల్లాలలో ధనుర్మాస పూజలు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లోని స్వాములకు ధనుర్మాసం సందర్భంగా మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములకు వడమాల, చెండు, జాజి పూలతో అలంకరించారు. సంజీవరాయ, భీమలింగేశ్వర, నరసింహ స్వాములకు ఆకులు, చెండు, మల్లె పూలతో అర్చకులు అలకంరించారు. భక్తులు స్వాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరం దేవాలయాలు, మైదుకూరు రోడ్డు, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు జింకా వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ఉద్యమనేత జింకా సుబ్బయ్య చేనేత పరిశ్రమకోసం విశేష కృషి చేశారని, గంజి కేంద్రాలు నిర్వహించి ప్రజల ఆకలి తీర్చారని సీనియర్ జర్నలిస్ట్ హుస్సేన్ తెలిపారు. అలాగే విశ్వప్రేమ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జింకా సుబ్రహ్మణ్యం, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మైదుకూరు : రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఏపీ రైతు సంఘం కృషి చేస్తోందని ఏడీఏ కృష్ణమూర్తి, కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఏఓ లక్ష్మీప్రసన్న, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, న్యాయవాది, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏవీ.శివరాం అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను వారు ఆవిష్కరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఉపాధ్యక్షుడు పెద్దపుల్లయ్య, సభ్యులు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి

చాపాడు : రబీలో సాగు చేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం క్రింద బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. మండలంలోని మదూరు, అన్నవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు ఆన్‌లైన్ కేంద్రాలలో డబ్బు చెల్లించి బీమా వివరాలు నమోదు చేయించాలని సూచించారు. విత్తనశుద్ధి చేస్తే వరి సాగు తర్వాత చీడపీడల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీలత పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బహుమతులతో జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలు

ప్రొద్దుటూరు : గ్రామీణ మహిళల్లోని శక్తిసామర్థ్యాలను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తహసీల్దార్ గంగయ్య తెలిపారు. మంగళవారం కడప నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్రీడా పోటీలు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్ మాట్లాడుతూ ఆటల పోటీలు మానవ జీవితంలో భాగంగా అలవాటు చేసుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళా క్రీడాకారులకు ఇలాంటి వేదికలు చక్కటి అవకాశాన్ని కలిస్తాయన్నారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ఆర్‌సీపీఈ కాలేజీ టీం మొదటి బహుమతి రూ.10వేలు, కడప జిల్లా స్పోర్ట్స్ అథారిటీ టీం రెండో బహుమతి రూ.7వేలు, కమలాపురం సీఎస్ఎస్ఆర్ కాలేజీ టీం తృతీయ బహుమతి 5వేలు, ట్రోఫీలను ముఖ్య అతిథులు అందించారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, హరిత రెడ్డి, సుబ్బయ్య, చేతన ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరించండి

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


మాజీ ఎమ్మెల్యేకు క్యాలెండర్ అందజేస్తున్న పార్టీ నాయకులు

ఖాజీపేట : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరి పీవీ.రాఘవరెడ్డి, ఖాజీపేట మండల కన్వీనర్ మురళీ మోహన్‌రెడ్డి మంగళవారం ప్రొద్దుటూరులో ఆయనను కలిసి వేంకటేశ్వరస్వామి క్యాలెండర్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోందని.. పార్టీ శ్రేణులు బలంగా పనిచేస్తే తిరిగి సీఎంగా జగన్మోహన్‌రెడ్డి ఎన్నికవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, వేమారెడ్డి, సుబ్బారెడ్డి, శెట్టిపల్లి సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు

మదనపల్లె : వృద్ధురాలిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు తాలూకా ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. మండలంలోని పెంచుపాడు పంచాయతీ గుట్టవారిపల్లెలో బంధువులు గొడవ పడుతుంటే పాపులమ్మ అడ్డుకునేందుకు ప్రయత్నించింది. స్థానికులు సోమశేఖర్, వెంకటేష్ భూవివాదం మనస్సులో ఉంచుకుని కక్ష పూరితంగా ఆమెపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. పాపులమ్మ తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజకీయ కక్షతో నాపై కేసు పెట్టారు

రేషన్ డీలర్ గురవయ్య ఆవేదన


బాధితుడు జే.గురవయ్య

చాపాడు : 16 ఏళ్లుగా చౌక దుకాణం నిర్వహిస్తూ.. వచ్చే సంపాదనతో భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్న తనపై అధికారులు వివక్షత చూపుతున్నారని చిన్నగురువళూరు రేషన్ డీలర్ జె.గురవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులతో మంగళవారం గురవయ్య మాట్లాడుతూ 2009లో చిన్నగురువళూరులోని 1114016 నెంబర్ చౌక దుకాణం డీలర్‌గా రాతపరీక్ష ద్వారా తనను ఎంపిక చేశారని, 16 ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా సరకులు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెవెన్యూ అధికారులు తనను రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారన్నారు. దానికి ఒప్పుకోకపోడంతో డిసెంబరు 11వ తేదీన ప్రొద్దుటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జున, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి తన దుకాణంపై దాడులు నిర్వహించారని, 78 కిలోల బియ్యం, ఆరు ప్యాకెట్ల చక్కెర, 18 కిలోల కందిపప్పు అధికంగా ఉన్నట్లు 6–ఎ కేసు నమోదు చేశారని తెలిపారు. ధికారులు చెబుతున్న స్టాకు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉందని, 15వతేదీ వరకూ గడువు ఉందని చెప్పినా అధికారులు కేసు నమోదు చేశారన్నారు. చౌక దుకాణం నుంచి సస్పెండ్ చేయకుండానే గ్రామ వీఆర్ఏ జయరాముడును ఇన్‌ఛార్జీ డీలర్‌గా పెట్టారన్నారు. ఈ నెల 1న సరకులు పంపిణీ చేయాల్సి ఉండగా, టీడీపీ నాయకులు సరకులు పంపిణీ చేస్తున్నారన్నారు. తన పేరుతో ఉన్న షాపు ఖాతా నుంచి రూ.13,600 నగదు చెల్లించారన్నారు. గత నెల 27న ఆర్డీఓ విచారణకు హాజరై తనకు జరిగిన అన్యాయం, అధికారులు వ్యవహరించిన తీరు తెలిపానన్నారు. ఉత్తర్వులు రాకముందే మండల రెవెన్యూ అధికారులు టీడీపీ నాయకుడు కుంచెం రమణారెడ్డిచే సరకులు పంపిణీ చేయిస్తున్నారన్నారు. తనకు ఆసరాగా ఉన్న దుకాణాన్ని తనకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

టీటీడీ ధార్మిక కార్యక్రమాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని కె.బసవాపురం రామాలయం వద్ద టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు మంగళవారం నుంచి మొదలైనట్లు టీటీడీ ఉపన్యాసకులు చాపాటి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకూ నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో శ్రీరాముడు ధర్మ స్వరూపుడు, ఆదర్శ పురుషోత్తముడు అంశాలపై ఉపన్యసిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, వీరాంజనేయుడు, వీరభద్రుడు, వెంకటలక్షుమ్మ, లక్ష్మీదేవి, రాఘవరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

10న ముక్కోటి ఏకాదశి వేడుక

దువ్వూరు(చాపాడు) : మండలంలోని గుడిపాడులో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి వేడుక నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పూజలు, అన్నదానం, గ్రామోత్సవం ఉంటాయన్నారు.

రాజుపాలెంలో 'పొలం పిలుస్తోంది'

కలసపాడు : మండలంలోని రాజుపాలెంలో గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ మాట్లాడుతూ సజ్జ పంటలో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అలాగే కత్తెర పురుగు, శనగపచ్చ పురుగు, వెర్రికంకి తెగుళ్ల నివారణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శివ, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

ప్రొద్దుటూరు రూరల్ : పట్టణంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో మంగళవారం ప్రొద్దుటూరు గ్రామ పొలాలకు సంబంధించి రెవెన్యూ సదస్సులు అధికారులు నిర్వహించారు. ఈ సదస్సులో మొత్తం 4 అర్జీలు రైతుల నుంచి వచ్చినట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం, భూమి ఆన్‌లైన్ కోసం రైతులు అర్జీలు సమర్పించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు


జంతువధశాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : కల్తీ, అనారోగ్యకరమైన జీవాల మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని మటన్ దుకాణాలు, జంతు వధశాల (ప్రైవేట్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్, మటన్ దుకాణాల వద్ద అపరిశుభ్రత వాతావరణం సృష్టించడంతోపాటు ట్రాఫిక్ అంతరాయం కలిగించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే జంతు వధశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దుకాణాల వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. చికెన్ దుకాణాల వద్ద లోడింగ్, అన్‌లోడింగ్ చేసే సమయంలో వ్యర్థాలు కింద పడటం వలన అపరిశుభ్రత, దుర్వాసన వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. మాంసం దుకాణాల వద్ద డ్రైనేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, వాటిని తక్షణమే స్వచ్ఛందంగా తొలగించాలని వ్యాపారులకు సూచించారు. మాంసం దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను ఇష్టానుసారంగా బయట పడవేయకుండా చెత్తసేకరణ వాహనాల్లో మాత్రమే వేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక సిబ్బంది, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించాలి

ప్రొద్దుటూరు రూరల్ : రబీ సీజన్‌లో సాగైన పత్తి పంటను తమ పరిధిలోని విలేజ్ అసిస్టెంట్‌తో పంట నమోదుతోపాటు ఆ రైతుకు ఈకేవైసీ చేయించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సురేష్ రెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని పెద్ద శెట్టిపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రం –1ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పంట నమోదుపై వీఏఏ పవన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంత శాతం పంట నమోదు పూర్తయింది, పంటల బీమా ప్రీమియం చెల్లింపు వివరాలను, రబీ సీజన్‌లో సాగైన పంటల వివరాలపై ఆయన ఆరా తీశారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి పంటను తప్పనిసరిగా విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌తో పంట నమోదు చేయించాలన్నారు.

స్మార్ట్ మీటర్ల అమలు వెనక్కు తీసుకోవాలి


వినతి పత్రం అందచేస్తున్న ఎంపీజే నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజలకు ఇబ్బందులు గురిచేసే విద్యుత్ స్మార్ట్ మీటర్ అమలును వెనక్కు తీసుకోవాలని ఎంపీజే నాయకులు ఏపీఎస్‌పీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డికి వినతి పత్రం అందచేశారు. మంగళవారం విద్యుత్ కార్యాలయంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌చార్జ్ ఎండీ అయూబ్‌ఖాన్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో గుట్టుచప్పుడు కాకుండా పాతమీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ప్రీ పేయిడ్ విధానం ద్వారా ముందుగా రీచార్జి చేసుకుంటేనే కరెంటు సరఫరా అవుతుందని, పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు ఉంటుందని ఇది సమాన్య ప్రజలపై పెనుభారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, మహ్మద్ రఫీ, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏపీటీఎఫ్ (257) క్యాలెండర్, డైరీని ఎంఈఓ మస్తాన్‌వలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ నాటి విద్యలో నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని, తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు గురించి ఇంటి వద్ద చదివే విధంగా జాగ్రత్త వహించాలని కోరారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మెర్సి మాలిని, ఏపీటీఎఫ్ నాయకులు వెంకటసుబ్బయ్య, వీరారెడ్డి, వెంకటరామిరెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న చిత్తా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు

కలసపాడు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం కలసపాడు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ మెంబర్‌గా నియమితులైన చిత్తా రాజశేఖర్‌రెడ్డి మంగళవారం కడపలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన పనిని పూర్తిస్థాయిలో బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. అలానే యువతకు చక్కటి ప్రోత్సాహం ఇస్తూ పార్టీని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించుకుని పార్టీ కోసం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ డైరెక్టర్ పులి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణ యాదవ్, షరీఫ్, సింగరయ్య, కె.సుబ్బారెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి రావులపల్లెలో రీ సర్వే

ఖాజీపేట : మండలంలోని రావులపల్లె గ్రామంలో ఈ నెల 20వ తేదీ నుంచి రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు మహబూబ్‌బాషా తెలిపారు. మండలంలోని తుడుమలదిన్నె, మిడుతూరు, చెమ్ముళ్లపల్లె, బుడ్డాయపల్లె గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని తెలిపారు. రావులపల్లెలో నాలుగు బృందాలు నిర్వహించే సర్వేకు అందరూ సహకరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే స్థలం అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే పొణ్యం యర్రమునిరెడ్డి కుటుంబీకులకు చెందిన స్థలాన్ని అక్రమంగా నకిలీ పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న నేపథ్యంలో అధికారులు స్పందించారు. 'మాజీ ఎమ్మెల్యే స్థలం అక్రమ రిజిస్ట్రేషన్' శీర్షికన సాక్షిలో గత శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాన్ని అధికారులు రద్దు చేశారు. రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫి అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 30 మందిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. మరో వైపు తహసీల్దార్ గంగయ్య సంఘటన స్థలానికి వెళ్లి తాము పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని ధ్రువీకరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు వివరాలను పరిశీలించి మాజీ ఎమ్మెల్యే స్థలానికి సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కాలువ కట్ట వద్ద ప్రొద్దుటూరు రెవెన్యూ విలేజ్ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 257, 258/1లోని స్థలం అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. మొత్తం 13 మంది ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున 26 సెంట్ల స్థలాన్ని నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరిలో ఇద్దరు ఈ స్థలాన్ని మరొకరికి అమ్ముకున్నారు. ప్రస్తుతం 15 డాక్యుమెంట్లకు సంబంధించిన స్థలం రిజిస్ట్రేషన్లను రద్దు చేసినట్లు సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు మంగళవారం సాక్షికి తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో తిరిగి ఈ స్థలం మాజీ ఎమ్మెల్యే కుటుంబీలకు దక్కింది. మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి సంబంధించిన అన్ని నకిలీ డాక్యుమెంట్లను రద్దు చేసినట్లు సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రకటించారు. నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ తయారు చేసిన వారిపై రెవెన్యూ అధికారులు, దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకున్న అక్రమార్కులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

అస్పత్రులకు బిల్లులు చెల్లించి పేదలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఆరోగ్యశ్రీ కనుమరుగు అయ్యేలా కనిపిస్తోందని పీఆర్, ఆర్‌డీ ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటించిందన్నారు. ఈహెచ్ఎస్, ఓపీ సేవలు బంద్ చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం కాకపోతే ఈ నెల 26 నుంచి అత్యవసర సేవలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించడం ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి డా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గొప్ప సంకల్పంతో తీసుకొచ్చిన ఈ పథకం ఎంతో మంది పేదవారి ఆయుష్షును పెంచిందన్నారు. ఇందుకు తోడు 108, 104లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కాగా తండ్రి బాటలో పయనిస్తూ ఆరోగ్య శ్రీ సేవలను పెంచడమే కాక ఆపరేషన్‌కు అయ్యే ఖర్చులను రూ.25 లక్షలకు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసానిచ్చారు. కూటమి ప్రభుత్వ పాలనలో విద్య, వైద్యానికి గడ్డు పరిస్థితులు దాపురించాయి. ఏడు నెలల్లో రూ. లక్ష కోట్లను అప్పు చేసిన ప్రభుత్వం వాటిలో ఒక్క రూపాయి అయినా పేదల ఆరోగ్యానికి ఖర్చు చేసిందా అని ప్రశ్నించారు. పాలన చేతగాని కూటమి పెద్దలు ప్రతిపక్ష పార్టీపై నిందలు వేయడం ఆపాలన్నారు. ప్రభుత్వం ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా సోషల్ మీడియా, టీవీ, యూట్యూబ్ ద్వారా ప్రజలు అన్నీ తెలుసుకుంటున్నారని నాగార్జునరెడ్డి గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆస్పత్రులకు బిల్లులు చెల్లించి పేదల ఆరోగ్యానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి


చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు వివేకానంద స్వామిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకుపోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూమిరెడ్డి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను తన బోధనల ద్వారా చైతన్య వంతులుగా చేసిన మహనీయుడు వివేకానంద అని కొనియాడారు. సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో దేశభక్తిని, ప్రకృతిపట్ల బాధ్యతను పెంపొందించేందుకు స్వామి వివేకానంద చిత్రం, ప్రకృతిని రక్షించకపోతే భవిష్యత్‌లో జరిగే పరిణామాలు అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.20,700 నగదు బహుమతులు, మెమెంటోలను అందచేశారు. కార్యక్రమంలో వివేకానంద ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు రాజోలి శ్రీధర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త శివాజి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గోవిందస్వామి ఆరాధన


ప్రత్యేక అలంకరణలో గోవిందస్వామి

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మంగళవారం శ్రీ గోవిందస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, బిల్వదళార్చన చేశారు. మధ్యాహ్నం ద్వారపూజ, నైవేద్యం, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి మాట్లాడుతూ జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి కుమారుడు గోవిందస్వామి అని తెలిపారు. శ్రీ వీరబ్రహ్మ క్షేత్రానికి మొదటి మఠాధిపతిగా విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. శ్రీ ఈశ్వరీదేవికి జన్మనిచ్చి మరింత పేరు ప్రఖ్యాతలు పొందారని చెప్పారు. అనంతరం రాత్రి ఉత్సాహ భరితంగా గ్రామోత్సవం నిర్వహించారు. గోవిందస్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువు దీర్చి మాడ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. భక్తులు, శిష్యులు అధిక సంఖ్యలో పాల్గొని, దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో చెరువుపల్లి వీరయ్యస్వామి, లక్ష్మీదేవి, బ్రహ్మయ్యస్వామి, ఈశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ ఎంతో కీలకం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉమాదేవి

మైదుకూరు : జీవితంలో ఆర్థిక క్రమశిక్షణ ఎంతో కీలకమని ప్రొఫెసర్ ఉమాదేవి అన్నారు. మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులకు స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ ఉమాదేవి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి అనవసరమైన ఖర్చులను తగ్గించుకొని భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని తెలిపారు. మ్యూచవల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్లపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆర్థిక ప్రణాళికపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు చిన్నరాయుడు మాట్లాడుతూ బంగారు నగల రూపంలో, భూముల రూపంలో ఇన్వెస్ట్ చేయడం కంటే స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడం మేలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ పీవీ.కృష్ణారెడ్డి, నరసింహారావు, అయ్యవారురెడ్డి, అనురాధ లక్ష్మీ, సుభాన్ సాహెబ్ పాల్గొన్నారు.

9, 10వ తేదీల్లో వైకుంఠ ఏకాదశి

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లెలో వెలసిన తిరుమలనాథస్వామి ఆలయంలో ఈ నెల 9, 10వ తేదీల్లో వైకుంఠ ఏకాదశి నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 9న ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, 108 కలశాలతో అభిషేకం, గణపతి హోమం, ధ్వజారోహణం, ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనం, లక్ష్మీనారాణ, సుదర్శన, నవగ్రహ హోమాలు, ఊంజల్, పవళింపు సేవ నిర్వహిస్తామని వివరించారు. 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు తిరుమల నాథ స్వామి కల్యాణోత్సవం, 12 గంటలకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని, సాయంత్రం స్వామివారి ఊరేగింపు, చక్రస్నానంతో కార్యక్రమాలు ముగిస్తామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమస్యలను పరిష్కరించండి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి

మైదుకూరు : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి కోరారు. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలం రానున్నందున, నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మం సాగర్ నుంచి పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటుచేసే బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఏఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రసన్నలక్ష్మీ, చిన్న కొండమ్మ, అధికారులు పాల్గొన్నారు.